
సాక్షి
బాపట్ల
మంగళవారం, 10, అక్టోబర్, 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.



అంకమ్మతల్లికి పూజలు

దాచేపల్లి : తక్కెళ్లపాడులోని అంకమ్మతల్లి, గోపయ్యస్వామి, గంగమ్మతల్లి ఆలయాల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలను విడుదల చేసినట్లు ఎస్‌ఎస్సీ ఏఈ పొట్లూరు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని బొగ్గువాగుకు విడుదల చేశారని పేర్కొన్నారు. మండలంలోని గంటావారిపాలెం సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఈనెల 11వ తేదీ నాటికి సాగర్ జలాలు చేరుతాయని వివరించారు. 12 రోజుల పాటు సాగర్ జలాలు విడుదలవుతాయని మంచినీటి చెరువులు, కుంటలు తదితరాలన్నీ పూర్తిస్థాయిలో నింపాలని సూచించారు.

యార్డుకు 29,046 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,046 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,633 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,481 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

5కే రన్ బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న ఓపెన్ 5కే రన్ బ్రోచర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య పి.జాన్సన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి జీవీఎస్ ప్రసాద్, పోటీల కమిటీ అధ్యక్షుడు నరాలశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా జైలులో పలు పోస్టులకు దరఖాస్తులు

పట్నంబజారు: గుంటూరు జిల్లా జైలు పరిధిలోని కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్స్ విధానంలో పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు గుంటూరు జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్‌కు రెండు పోస్టులకు రూ.18,500 జీతం ఇస్తారని పేర్కొన్నారు. అదే విధంగా కార్యాలయ సబార్డినేట్, వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వారికి రూ.15 వేలు జీతం ఇస్తారని వివరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు https//guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి



మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గుడిలో(శివాలయం)లో జరిగే దసరా బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోరారు. నగరంలోని శివాలయంలో సోమవారం ఎమ్మెల్సీ హనుమంతరావు ఆప్కో మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవితో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయంలో జరుగుతున్న మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేసి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎ.రామకోటిరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరెళ్ల లక్ష్మీరాధిక, బోర్డు సభ్యులు కొల్లి ముసలారెడ్డి, రేఖా వకుళాదేవి, అద్దంకి వెంకటేశ్వర్లు, అర్చకులు బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యుడు తెలకపల్లి మహేష్ శర్మ, శ్యాంసుందర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో పంగులూరు కూత

క్రీడల్లో పల్లె బిడ్డలు మెరుస్తున్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడ వసతులు అంతంతమాత్రమే.. అయినా లెక్కచేయలేదు.. తదేక దీక్షతో సాధన కొనసాగించారు.. స్థానిక వనరులను వినియోగించుకున్నారు.. మెట్టుమెట్టు ఎక్కుతూ.. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు.. ఖోఖోలో పంగులూరు పేరు కూత పుట్టిస్తున్నారు.

- జాతీయ ఖోఖో జట్టు కోచ్‌గా ఆవులయ్య
- జట్టులో స్థానం సాధించిన సూరినాయుడు
- 12 నుంచి కౌలాలంపూర్‌లో అంతర్జాతీయ పోటీలు



ఎస్ఆర్ఆర్ అకాడమీలో ప్రాక్టిస్ చేస్తున్న క్రీడాకారులు

జే పంగులూరు: క్రీడల్లో పంగులూరుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలు అయినా సరే పేరు మారుమోగాల్సిందే. పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారు. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు మలేషియాలోని కౌలాలంపూర్ నిర్వహించనున్న అండర్-18 పోటీలకు జాతీయ బాలుర జట్టుకు కోచ్‌గా నక్కా ఆవులయ్య, జట్టులో సభ్యుడిగా రేజేటి సూరినాయుడు ఎంపికయ్యారు.

కౌలాలంపూర్‌కు సూరినాయుడు..



రేజేటి సూరినాయుడు పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 8వ తరగతిలో చేరాడు. తండ్రి వ్యవసాయం. సూరినాయుడు పంగులూరులో ఉంటున్నాడు. ప్రకాశం జిల్లా తరఫున అండర్-18 విభాగంలో బాలుర ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్రం తరఫున మార్చిలో పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టులో స్థానం సాధించాడు. ఈనెల 12వ నుంచి 16వ తేదీ వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. గతంలో సూరినాయుడు అండర్-14 విభాగంలో పుణేలో నిర్వహించిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో, ఖేలో ఇండియా జాతీయ స్థాయి, కర్నూలు, ఈదర తదితర చోట్ల రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. వీరిని రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, అధ్యక్షుడు ప్రసాద్, వ్యాయాయ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ట్రెజరర్ కె.హనుమంతరావు, కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి అభినందనలు తెలిపారు.

అటవీ ప్రాంతం నుంచి కోచ్‌గా ఆవులయ్య..



కోచ్‌గా ఎంపికైన నక్కా ఆవులయ్యది ఉమ్మడి ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం తెల్లగట్ల గ్రామం. ఈ పోటీలకు బాలుర జట్టుకు గత నెల 15 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఢిల్లీలోని జవహర్ లాల్ స్టేడియంలో ఖోఖో ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ ఇండియా బాలుర ఖోఖో కోచ్‌గా నక్కా ఆవులయ్య (యన్ ఐఎస్), ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ తరఫున నియమితులై కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. 2011 నుంచి 2012 వరకు ఎన్ఐఎస్ కోచ్‌గా, 2017 పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ కోచ్‌గా చేసి సబ్ జూనియర్, జూనియర్ నేషనల్, సీనియర్ నేషనల్, సౌత్ జోన్, ఫెడరేషన్ కప్‌లకు కోచ్‌గా వ్యవహరించాడు. అల్టిమేట్ ఖోఖో జట్టుకి కోచ్‌గా వ్యవహరించి బంగారు పతకం సాధించాడు. ప్రస్తుతం ఆవులయ్య, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. తన ప్రతిభను గుర్తించి పలుమార్లు ఈ స్థాయికి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, అధ్యక్షుడు ప్రసాద్, వ్యాయాయ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా ఖోఖో ట్రెజరర్ కె.హనుమంతరావు, ప్రకాశం జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్ బాషా

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

బాపట్ల అర్బన్: స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్పందన కార్యక్రమంలో రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల్లో రీ ఓపెన్ అర్జీలు ఉన్నాయని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, సీపీఓ భరత్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్ మోహన్ శెట్టి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ అర్జున్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ చంద్రశేఖర్ రెడ్డి, మత్స్య శాఖ జేడీ సురేష్, పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ విల్లెమ్స్, డీఎం శ్రీలక్ష్మి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్ పాల్గొన్నారు. స్పందనకు వచ్చే అర్జీదారులకు ప్రతి సోమవారం అర్జీదారులకు అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ భట్టు, సభ్యులు బూర్లె రామసుబ్బారావు, సత్యనారాయణ రాజు, రామచంద్ర రాజు, రమణ బాబు, డేవిడ్ రాజు, మల్లెల వేణు, గోపి కృష్ణ మహోన్నత ఆశయానికి శ్రీకారం చుట్టారు.

కలెక్టర్ రంజిత్ బాషా

ఆస్పత్రులకు అనుమతి లేకుంటే చర్యలు

చీరాల: ఆస్పత్రులు అనుమతులు లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరించారు. సోమవారం చీరాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బయో మెడికల్ వ్యర్థాల మేనేజ్‌మెంట్ నిబంధనలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 40 ఆస్పత్రులు అనుమతి లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనుమతులు లేని వైద్యశాలలను పరిశీలించడానికి సబ్ కమిటీలు నియమించాలని ఆదేశించారు. 50 పడకల ఆస్పత్రులు జిల్లాలో పది ఉండగా వాటి నుంచి అధిక స్థాయిలో వ్యర్థాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు అధికారులు సక్రమంగా అమలు చేయాలని సూచించారు. వ్యర్థాలను సాంకేతిక పద్ధతిలో తొలగించాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి కాలుష్య నియంత్రణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యశాలలో చెత్త తొలగింపు పన్నులు వేయాలన్నారు. సీబీఎండబ్ల్యూటీ పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీలకు సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ జి.రాఘవరెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

• ఆత్మీయ పలకరింపు



విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొన్నారు. సీఎం, మోపిదేవితో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. చిత్రంలో శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నారు.

- సాక్షి, విజయవాడ


• జై జగ'నిజం'



ప్రతినిధుల సభకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మీయంగా పలకరిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చిత్రంలో మంత్రులు జోగి రమేష్, ఆర్కే రోజా

విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు జయహో జగనిజం అంటూ నినదించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం అంటూ జయ గళమెత్తారు. సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం అంటూ గర్జించారు. ఈ సభలో జిల్లాకు చెందిన పార్టీ నేతలు స్ఫూర్తిదాయ ప్రసంగాలు చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్







సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్

పేదలకు కార్పొరేట్ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ అశోక్‌బాబు



వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ అశోక్‌బాబు

చినగంజాం: ప్రతి పేదవాడికి అవసరమైన వైద్యాన్ని కార్పొరేట్ తరహాలో ఉచితంగా అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు తెలిపారు. మండలంలోని కడవకుదురులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఏ ఒక్కరూ పెద్ద వైద్యానికి ఇబ్బందులు పడకూడదనేదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనగా పేర్కొన్నారు. ఈ మెడికల్ క్యాంపుల ద్వారా ఏడు రకాల పరీక్షలు, 172 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. ఈ పరీక్షలు ప్రైవేటు ఆస్పత్రిలో చేయించుకుంటే కనీసం రూ.2 వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు వ్యక్తులుంటే రూ.8,000 ఖర్చును ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. ఉచిత వైద్యంతో పాటు మంచి మందులను కూడా ఉచితంగానే అందిస్తున్నామని చెప్పారు. దేశంలో వైద్యరంగంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి వైద్య సేవలు అందడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 45 రోజుల పాటు జరిగే ఈ క్యాంపుల ద్వారా అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు వివరించారు. కంటి సంబంధిత వ్యాధులకు కూడా అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు.

కార్యక్రమంలో సర్పంచి జీ శివకుమారి, ఎంపీడీఓ కే స్వరూపరాణి, ఈఓపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణ మూర్తి, వైద్యాధికారి కీర్తి సరోజ్, పంచాయతీ కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

డీఆర్ఎం కప్ వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ విజేతల ప్రకటన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కప్ పోటీలలో క్రీడాకారులు సత్తాచాటుతున్నారని డీఆర్ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక పట్టాభిపురం లోని తన కార్యాలయంలో సోమవారం విజేతల వివరాలను వెల్లడించారు. వాలీబాల్‌లో 16 జట్లు పోటీపడగా మొదటి నలుగుస్థానాలు వరుసగా జెట్లీ జట్టు, గుంటూరు రైల్వే, గుంటూరు పోలీస్, తెనాలి జట్టు సాధించినట్టు వెల్లడించారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో 32 జట్లు పోటీ పడగా మొదటిస్థానం విజయసాయిరెడ్డి, జి.జితేంద్ర, ద్వితీయ స్థానం సిద్ధార్థ గౌతమ్,జయంత్, తృతీయ స్థానం సాయి, అబ్బాస్, నాలుగో స్థానం గుంటూరు రైల్వే జట్టు నుంచి జి.రాజ్‌పల్‌సింగ్, షేక్.రియాజ్ సాధించినట్టు తెలిపారు.

14 క్రికెట్ సూపర్ ఫైనల్స్

క్రికెట్ విభాగంలో మొత్తం 12 జట్లు పాల్గొనగా సూపర్ ఫైనల్స్‌కు డీఆర్ఎం-11, ఎస్పీ, పల్నాడు-11, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్-11 జట్లు చేరుకున్నాయని వెల్లడించారు. సూపర్ ఫైనల్స్ ఈనెల 14న నల్లపాడు పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయని, 15న ఫైనల్ పోటీ ఉంటుందని వివరించారు.

క్లుప్తంగా

డాక్టర్ నాగూర్‌బాషాకు గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డు



గుంటూరు మెడికల్: జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక య్యారు. ఆయన గుంటూరు జీజీహెచ్‌లో అనేక క్లిష్టమైన గ్యాస్ట్రో ఎంట్రాలజీ శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేసి పలువురి ప్రాణాలు కాపాడారు. స్థానిక గుంటూరువారి తోటలోని కేర్‌వెల్ హాస్పిటల్‌లో సామాజిక సేవా దృక్పథంతో ప్రతినెలా ఒక్కో రోగికి రూ.10 వేలు ఖరీదు చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అత్యంత ఖరీదైన అతిక్లిష్టమైన ఆపరేషన్‌లను అతి తక్కువఖర్చుతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విజయవంతంగా చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డాక్టర్ నాగూర్ బాషా ఈనెల 12న న్యూఢిల్లీలో ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డును అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన విషయాన్ని సోమవారం కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌస్ బాషా మీడియాకు వెల్లడించారు. నగరంలోని పలువురు వైద్యులు, కేర్‌వెల్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది డాక్టర్ నాగూర్ బాషాకు అభినందనలు తెలిపారు.

12న ఏకపాత్రాభినయ, జానపద నృత్య పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12న జిల్లాస్థాయిలో ఏకపాత్రాభినయం, జానపద నృత్య (రోల్‌ప్లే, ఫోక్ డ్యాన్స్) పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయపాలెంలోని డైట్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులతో పాటు సంబంధిత పాఠశాల నుంచి ఒక టీచర్ విధిగా హాజరు కావాలని సూచించారు. భోజన సదుపాయం ఉంటుందని, వివరాలకు డైట్ అధ్యాపకులు పి.పోలేరును 9704790917లో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి, ఏడీఏ సత్తార్


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

చీరాల టౌన్: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేకాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని సచివాలయం–2 పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అద్భుతమన్నారు. పలు విభాగాల వైద్యులు బృందంగా ఏర్పడి వైద్య సేవలు, పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తోందన్నారు. ఐదుగురు వైద్యులతో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజిస్ట్, కంటి వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్య బృందంతో 445 మందికి వైద్య సేవలు, రక్త పరీక్షలు చేసి వ్యాధినిర్ధారణ, ఈసీజీతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాంపులో ఎంపీడీఓ కే నేతాజీ, ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ పీకా సురేష్‌బాబు, ఆర్ఐ శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు బిత్రా శ్రీను, బి.మురళీ, మస్తాన్, వెంకటేశ్వరమ్మ, బి.జ్వాలా, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చరిత్రకు అద్దం పడతాయి తపాలా బిళ్లలు


తపాలా బిళ్లల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

బాపట్ల అర్బన్: తపాలా బిళ్లలు చరిత్రకు అద్దం పడతాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. ప్రపంచ తపాలా దినోత్సవ సందర్భంగా సోమవారం ప్రధాన తపాలా కార్యాలయంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తపాలా బిళ్లల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ పలు చారిత్రక ఘట్టాలను, విశేషాలను వీటి ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మహనీయుల చిత్రాలను దర్శించవచ్చని, తపాలా బిళ్ళల సేకరణ ఒక మంచి హాబీ అన్నారు. దీని ద్వారా పిల్లలు ఎన్నో విషయాలను అవగతం చేసుకోగలుగుతారని తెలిపారు. వారిలో సామాజిక దృక్పథం పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ జీవీ సత్యనారాయణ, నందా ఆంజనేయ దత్తు, ఏపీఎం పి.నరసింహారావు, సీపీసీ డి.నాగరాజు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని అథ్లెటిక్ కోచ్ ఈశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించనున్న 37వ సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడం అంత సులభం కాదన్నారు. విజయమే లక్ష్యంగా బరిలో దిగాలని తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, నూతలపాటి గోపీనాథ్, గమిడి సాంబశివరావు క్రీడా దుస్తులు బహూకరించారు. ఎం.వెంకట మారుతీ గురుశంకర్, పి.నరేంద్ర, సిహెచ్.ఆదినారాయణ, బి.నాగవిహారిక, టి.నాగయోచన, ఎం.మధుబాబు, ఇ.హేమసాయి, ఎండీ ఆసియా, రూపలిత పాత్ర, ఎస్‌కే నూర్, ఎస్.కె.రోషన్, ఎస్‌కే కరీష్మ, ఎం.అఖిల్ వర్ధన్, వి.హాసిని.

నకిలీ దస్తావేజుతో స్థలాన్ని కబ్జా చేశారు

- కొడుకుల నుంచి రక్షించాలి..
- ఉద్యోగం పేరుతో రూ.12 లక్షలు స్వాహా..
- స్పందనలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ వకుల్‌జిందాల్


బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 62 మంది బాధితులు ఎస్పీకి అర్జీలు అందించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గ్రామంలో నాకు మా తాత దగ్గుబాటి అంజయ్య వీలునామా ద్వారా కొంత స్థలాన్ని అప్పగించారు. అయితే కొల్లా సువర్ణకుమారి, కొల్లా శ్రీరాములు, తక్కెళ్లపాటి అంజనాదేవి, కొల్లా రమాదేవి, వలేటి బుజ్జి నకిలీ పత్రాలతో నా స్థలాన్ని కబ్జా చేశారు. నాకు హక్కు కలిగిన నా స్థలంలోకి నన్ను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. ఈ స్థలంపై విచారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. పై వ్యక్తుల వలన నాకు ప్రాణహాని ఉంది.

–కొల్లా పవన్‌కుమార్, కారంచేడు

మా కొడుకులతో మాకు ప్రాణహాని

రేపల్లె పట్టణం, నేతాజీ నగర్‌కు చెందిన కొనగాల రాధాకృష్ణమూర్తి, కొనగాల వెంకటేశ్వరమ్మకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. వృద్ధాప్యంలో ఉన్న వీరిని కుమారులు శ్రీనివాసరావు, నాంచరయ్య నిత్యం మద్యం తాగి వచ్చి కొట్టాలని చూస్తున్నారు. భార్య పేరుతో ఉన్న ప్లాట్‌ను కూడా వాళ్లే అమ్ముకోవాలని చూస్తున్నారు. విక్రయించి వచ్చిన డబ్బును వారికి ఇవ్వకపోతే మమ్ములను చంపుతామని బెదిరిస్తున్నారు. మా కుమారుల చెర నుంచి మమ్ములను కాపాడండి.

– వృద్ధ దంపతుల ఆవేదన

ఉద్యోగం పేరుతో రూ.12 లక్షలు స్వాహా చేశారు

గుంటూరు పట్టణంలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. నాకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, లక్నోలో ఉద్యోగం ఇప్పిస్తానని గుంటూరు సంగటిగుంటకు చెందిన కుర్రా శివశంకరరావు, కుంచాల దుర్గాప్రసాద్, బాపట్ల జిల్లా, కర్లపాలెం మండల కేంద్రానికి షేక్ అబ్దుల్ కరీం నమ్మించారు. నాతో పాటు పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన పులగం మణికంఠరెడ్డిలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి మా వద్ద నుంచి రూ.12 లక్షలు స్వాహా చేశారు. మా డబ్బులు మాకు ఇవ్వకుండా మమ్ములను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– అడపాల హరీష్, పాతగుంటూరు

గుంటూరు డివిజన్‌లో పలు స్టేషన్‌లకు స్టాప్‌ల కేటాయింపు

సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం పలు స్టేషన్‌లలో స్టాప్‌లు కేటాయించినట్లు డివిజన్ సీనియర్ మేనేజర్(డీసీఎం) దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 12795 విజయవాడ- లింగంపల్లి రాత్రి 8.10 గంటలకు విజయవాడ నుంచి బయలు దేరుతుందని, 12796 లింగంపల్లి- విజయవాడ రైలు లింగంపల్లి స్టేషన్ నుంచి ఉదయం 06.50 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్లకు సోమవారం నుంచి నల్గొండ స్టేషన్‌లో స్టాప్ కేటాయించినట్లు చెప్పారు. అదే విధంగా రైలు నెంబర్ 17645 సికింద్రబాద్- రేపల్లె రైలు మధ్యాహ్నం 02.05 గంటలకు సికింద్రబాద్ స్టేషన్ నుంచి బయలు దేరుతుందని, 17646 రేపల్లె- సికింద్రబాద్ రైలు రేపల్లె స్టేషన్ నుంచి ఉదయం 11.54 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్లు ఈనెల 9వ తేదీ నుంచి చిట్యాల స్టేషన్‌కు స్టాప్ కేటాయించడం జరిగిందని వివరించారు.

స్కూల్స్ గేమ్స్ ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా, కబడ్డీ జిల్లా జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. సెపక్ తక్రా అండర్–14, అండర్–17 బాల బాలికల జట్ల ఎంపికలను మంగళవారం సత్తెనపల్లి మండలం గుడిపూడి జెడ్పీ హైస్కూల్‌లో, కబడ్డీ అండర్–17 బాల బాలికల జట్ల ఎంపిక పోటీలను ఈనెల 13వ తేదీ నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆయా తేదీలలో ఉదయం 9 గంటలకు అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని కోరారు.

గుండె ధైర్యం నింపేలా..


చికిత్సకు బయల్దేరిన గ్రామస్తులతో అంబటి మురళీ కృష్ణ

జగన్నామ సంక్షేమం కింద గుండె చికిత్సకు రోగుల తరలింపు

- చికిత్స పొందేవారిలో ధైర్యం నింపిన బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: జబ్బు కంటే భయం మనిషికి ఎక్కువ నష్టాన్ని కలుగ జేస్తుందని, అందుకే బజరంగ్ ఫౌండేషన్ పేదల్లోని భయాన్ని పోగొట్టి, ధైర్యాన్ని - మానసిక స్థైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తోందని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పొన్నూరు మండలం కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామాలలో నిర్వహించిన గుండె సంబంధిత వైద్య పరీక్ష శిబిరంలో వ్యాధి నిర్ధారణ జరిగి యాంజియోగ్రామ్ అవసరమైన 40 మందిలో తొలి విడతగా 20 మందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆస్పత్రికి సోమవారం తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పేరుపేరునా ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మమేకమైన బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంజియోగ్రామ్ టెస్టు చేసే వైద్య బృందానికి సహకరించాలని, ఏ దశలోనూ ఒత్తిడికి గురికావద్దని వారికి సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మక ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ వైద్య సేవలు లభిస్తున్నాయని ప్రత్యేకంగా వివరించారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను ఉచితంగా అందిస్తూ వారి ఆయుష్షు పెంచుతున్న ఆరోగ్య శ్రీ పథకం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. అత్యంత వేగవంతంగా, పారదర్శకంగా, సంతృప్తికరంగా ఆరోగ్యశ్రీ పథకం అమలు జరుగుతున్న తీరును వివరించారు. సోమవారం సాయంత్రానికి 20 యాంజియోగ్రామ్ పరీక్షలు జరగ్గా, వారిలో ఆరుగురికి స్టంట్లు, నలుగురికి బైపాస్ సర్జరీ అవసరమైనట్లు వైద్యులు తెలిపారు.

బాధ్యతకు మారుపేరు బజరంగ్ ఫౌండేషన్

జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో వైద్య శిబిరాన్ని తమకు అత్యంత అందుబాటులో ఏర్పాటు చేయటం మొదలు, ఇంటింటికి వచ్చి తమకు ఏమాత్రం అవగాహన లేకపోయినా, అన్ని తామై నడిపిస్తూ, చెప్పిన మాట ప్రకారమే సోమవారం తెల్లారేసరికి వారికోసమే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసిన తీరుకు కట్టెంపూడి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో.. చెప్పిన మాట చెప్పినట్లు చేతల్లో చూపిస్తూ, నిండు ప్రాణాలు నిలబెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ సేవలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం



పాత గుంటూరు: కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సీజీఎస్‌టీలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాల సహకారం అందిస్తానని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కన్నా వారి తోటలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ అసోసియేషన్ నాయకులు కమిషనర్ సాధు నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. కమిషనర్ మాట్లాడుతూ పెన్షనర్లు కోరిన వెంటనే గుర్తింపు కార్డులు ఇస్తున్నామని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో టీ వివేకానంద, గద్దె తిలక్, సీతారామయ్య, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఏసీఏ సెంట్రల్‌జోన్‌లో గుంటూరు ఘన విజయం

- ప్రకాశం జట్టుపై 3 వికెట్ల తేడాతో విజయం
- రేపు గుంటూరు– కృష్ణా జట్ల మధ్య మూడో మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్–23 అంతర్ జిల్లాల మూడు రోజుల టెస్ట్‌మ్యాచ్‌లలో భాగంగా జరుగుతున్న గుంటూరు, ప్రకాశం జిల్లాల మ్యాచ్‌లో గుంటూరు జిల్లా జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్ల నష్టానికి 52 పరుగులతో సోమవారం చివరిరోజు ఆట కొనసాగించిన గుంటూరు జట్టు విజయానికి అవసరమైన 107 పరుగులను మరో నాలుగు వికెట్లు కోల్పోయి సాధించింది. జట్టు కెప్టెన్ మామిడి వంశీకృష్ణ 58 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, కె.మనోహర్ 34, పి.ఆదిత్యారెడ్డి 21 పరుగులతో జట్టు విజయంలో తమవంతు పాత్ర పోషించారు. ప్రకాశం బౌలర్లు పాశం నవీన్ 3, దుర్గాబాలాజీ 2, సాయి 2వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. కాగా, ఈనెల 11వతేదీ బుధవారం నుంచి గుంటూరు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య మూడో మ్యాచ్ జరగనుంది.

బాడీ బిల్డింగ్ పోటీల్లో మస్తాన్ వలి ప్రతిభ



పిడుగురాళ్ల: బాడీ బిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన మస్తాన్ వలి ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన సెంట్రల్ జోన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. పల్నాడు జిల్లా నుంచి పిడుగురాళ్ల ఓయాసిస్ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న మస్తాన్ వలికి మాత్రమే అవకాశం రావటం బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో మూడో బహుమతి కైవసం చేసుకోవటంతో పలువురు అభినందించారు.

నేడు చెరుకుపల్లిలో జాబ్‌మేళా

చెరుకుపల్లి: నిరుద్యోగ యువతి, యువకులకు జాబ్‌మేళా మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ.తమ్మాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(సీడప్), జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మేళాలో సీఈటీసీ, సోలార్, హ్యుండయ్, ఎస్ఎస్ఎల్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. వివరాల కోసం 90323 84374, 93462 80298 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాల కేసులో నిందితుడి అరెస్ట్

మార్టూరు: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన పాత కేసులో నిందితుడిని పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. మార్టూరు సీఐ ఎస్‌కే ఫిరోజ్ అందించిన వివరాలు.. బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద గతేడాది డిసెంబర్ 7వ తేదీ బెంగళూరు నుంచి విజయవాడకు మత్తు పదార్థాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న పఠాన్ జమీల్‌ఖాన్, ఆరీఫ్ ఇద్దరు నిందితులను అప్పట్లో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు మరో నిందితుడైన మోటూరి సందీప్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఆదివారం రాత్రి యద్దనపూడి ఎస్ఐ నాగశ్రీను తమ బృందంతో ఏలూరు జిల్లా రావులపాలెంలో అరెస్టు చేసి మార్టూరుకు తరలించారు. వైద్యపరీక్షల అనంతరం సందీప్‌ను సోమవారం అద్దంకి కోర్టుకు తరలించినట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు.

మానసిక ఆరోగ్యం అందరికీ అవసరం

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్
- జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు

ఏఎన్‌యూ: సమాజంలో మానసిక ఆరోగ్యానికి ఎంతో ప్రాముఖ్యం పెరిగిందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈనెల 14న యూనివర్సిటీ సైకాలజీ విభాగం, సైకాలజిస్టుల సంఘం ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో మానసిక ఆరోగ్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో అన్ని వర్గాల్లోనూ మానసిక సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వీటిపై అవగాహన కల్పించడమే దీనికి సరైన మందు అని ఆయన అభిప్రాయపడ్డారు. సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ మానసిక అంశాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వసంతరావు, అధ్యాపకులు డాక్టర్ టీడీ విమల, ఎస్.అనుపమ, ఏపీఏ ఇండియా ప్రతినిధులు కృష్ణ భరత్, తేజ పాల్గొన్నారు.